సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 5 । జనవరి । 2025



ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విజయవాడ సింగ్ నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం ఈప్రదర్శన నిర్వహించారు.



హుండీ కానుకల లెక్కింపు

గంపలగూడెం: నెమలి గ్రామంలో వేంచేసిన వేణు గోపాలస్వామి ఆలయ హుండీ కానుకలను శనివారం లెక్కించారు. రూ.17.54 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎం.సంధ్య తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన బేహీరా సుదం రూ.లక్ష విరాళం సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

11న బేవరేజెస్ డిపోలో బహిరంగ వేలం పాట

రామవరప్పాడు: ఏపీఎస్‌బీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని ఏపీ స్టేట్ బేవరేజెస్ డిపో పరిధిలోని ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించి వివిధ వస్తువులకు ఈనెల 11న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.సునీత శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేలం పాటలో 60 ఫ్రీజర్స్ (ఒక్కొక్కటి నిర్ణయించిన ధర రూ.18,900), 61 బ్యాటరీ ఇన్వర్టర్లు (నిర్ణయించిన ధర రూ.15,525), 78 గోద్రెజ్ క్యాష్ చెస్ట్‌లు (నిర్ణయించిన ధర రూ.2,837), 65 క్యాష్ కౌంటింగ్ మిషన్లు (నిర్ణయించిన ధర రూ.657) వేలం వేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90004 76476, 91771 17734 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సీపీఎస్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఉద్యోగుల సంఘ క్యాలెండర్‌ను కలెక్టర్ డీకే బాలాజీ శనివారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేకేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ బాలాజీతో పాటు జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాంచారయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీఎం దాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అర్జా నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్లి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

7న ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

గుడివాడరూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ–సిడాప్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల, గుడివాడ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ మంగళవారం స్థానిక ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు శనివారం తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు, ఐటీఐ ఫిట్టర్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుంచి 31 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.21వేల వరకు అనుభవం, అర్హత బట్టి వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 98488 19682, 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

దుర్గమ్మ సేవలో దేవదాయశాఖ మంత్రి ఆనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రికి ఆలయ ఇన్‌చార్జి ఈఓ రామచంద్రమోహన్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం మంత్రికి పండితులు వేద ఆశీర్వచనం, ఈఓ, డీఈఓ రత్నరాజులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం ఈఓ చాంబర్‌లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆలయ ఈఓ, డీఈఓ, ఈఈలతో పాటు ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోజువారీ జరిగే అర్జిత సేవలు, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులతో సెక్యూరిటీ సిబ్బంది మర్యాద పూర్వకంగా మసులుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరూ ఆనందం, ఆరోగ్యం, శ్రేయస్సుతో ఉల్లాసంగా జీవించాలని దుర్గమ్మను ప్రార్థించానని పేర్కొన్నారు. రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై దృష్టి సారించామన్నారు.



కటింగ్ మాస్టర్

కోటి ఆశలతో ఓటేసి గెలిపించిన దివ్యాంగులకు నూతన సంవత్సరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నారు. నకిలీ పింఛన్ల ఏరివేత పేరుతో ఉన్న పింఛన్లకు కత్తెర పెట్టేందుకు సర్వే చేయిస్తున్నారు. కొత్తగా ధ్రువపత్రాల జారీ నిలిపివేశారు. దివ్యాంగుల పింఛన్ల కోత అయిపోయాక తరువాతి వంతు మనదే అవుతుందని వృద్ధులు, వితంతువులు ఆందోళన చెందుతున్నారు.

విచారణ చేసేదిలా...

- మంచానికే పరిమితమైన కేటగిరీలో పింఛను పొందుతున్న వారి ఇళ్లకు వైద్యులు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు.
- ఇందు కోసం ఇతర నియోజకవర్గాల్లో వైద్యులను నియమిస్తారు.
- పేరు పరిశీలించి సెర్ప్ రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేస్తారు.
- ఈ ప్రక్రియ జనవరి 3 నుంచి నెలాఖరు వరకు ఉంటుంది.
- వైకల్య ధ్రువీకరణ పత్రాలతో నెలకు రూ.6వేల పింఛను పొందే వారికి ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి వైద్య పరీక్షలు ఉంటాయి.
- తమ సమీప ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైకల్య పరీక్షలు చేస్తారు.
- ఈ కార్యక్రమం ఈ ఏడాది మే నెల చివరి వరకు కొనసాగే అవకాశం ఉంది.
- ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ కొత్త పింఛన్ల మంజూరు ఉండదు.

- తాత్కాలికంగా సదరం ధ్రువ పత్రాల జారీ నిలుపుదల
- జిల్లాలో 2.37లక్షల దివ్యాంగుల పింఛన్లు
- ఉన్న పింఛన్ల తగ్గింపునకు జల్లెడ పడుతున్న కూటమి సర్కార్

నకిలీల పేరుతో దివ్యాంగ పింఛన్ల ఏరివేతకు కుట్ర



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు (ఫైల్)

గుడ్లవల్లేరు: జిల్లాలో ఇంటింటికీ దివ్యాంగ పింఛన్ల తనిఖీలకు ఒక షెడ్యూల్ ప్రకారం వెళ్లేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. నకిలీ ధ్రువ పత్రాలతో కొందరు దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో వారిని గుర్తించి తొలగించేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లను ఇచ్చింది.

కోత విధించేందుకేనా..?

దివ్యాంగ పింఛనుదారుల్లో జిల్లా వ్యాప్తంగా అనర్హుల లెక్క తేల్చేందుకే కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాలో మంచానికే పరిమితమైన వారి కేటగిరిలో రూ.15వేలు, వైకల్య ధ్రువ పత్రాలు ఉంటే రూ.6వేల చొప్పున పింఛన్లను పొందుతున్న వారి పత్రాలు, వివరాలను సమగ్రంగా పరిశీలించి కోతలను విధించాలని ప్రభుత్వం భావిస్తోంది. నిజంగా అనర్హుల్ని తొలగిస్తే... అందరూ హర్షిస్తారు. కానీ అనర్హుల మాటున నిజమైన లబ్ధిదారులను తొలగించే అవకాశాలు కూడా ఉన్నాయని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో చాలా చోట్ల దివ్యాంగులన్న జాలి కూడా లేకుండా తమ అధికార బలంతో అర్హుల పింఛన్లను సైతం తొలగించి కక్ష సాధించడమే అందుకు నిదర్శనమని అంటున్నారు.

ధ్రువపత్రాలిచ్చిన డాక్టర్లను అనుమానిస్తున్నారా?



సదరం ద్వారానే దివ్యాంగుల వైకల్యాన్ని గుర్తించినపుడు మళ్లీ అదే డాక్టర్లతోనే విచారణలు ఎందుకు చేస్తున్నారు? అంటే ధ్రువ పత్రాలు ఇచ్చిన డాక్టర్లను అనుమానిస్తున్నారా?

– బందెల కిరణ్‌రాజు, వైఎస్సార్ సీపీ వికలాంగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

అర్హుల్ని బలి చేయొద్దు...



నకిలీల ఏరివేత పేరుతో చంద్రబాబు ప్రభుత్వం అర్హుల్ని బలి చేస్తే మాత్రం జనం క్షమించరు. కూటమి ప్రభుత్వంలో అనేక మంది అర్హుల పింఛన్లను ఎత్తివేశారు.

– దొండపాటి మధు, దివ్యాంగుల సంఘ రీజనల్ కోఆర్డినేటర్

కృష్ణా వర్సిటీ వాలీబాల్ జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ మహిళల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన తెలిపారు. తమ కాలేజీ ఆధ్వర్యంలో ఇటీవల ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన ఎస్.సంజన, అంకిత, దివ్య, దీవెన, సుప్రియ, మేఘన, హారిక, సీత, సుధారాణి, జయ, ప్రశాంతి, భువనేశ్వరి, తనుశ్రీ, దీపిక జట్టుకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.హేమ వ్యవహరిస్తారని, ఈ నెల ఏడు నుంచి 11వ తేదీ వరకు చెన్నైలోని జెప్పియార్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. జట్టు బృందాన్ని కళాశాల ప్రాంగణంలో కళాశాల కన్వీనర్ లలితప్రసాద్, ప్రత్యేక అధికారి డాక్టర్ ఆర్.మాధవి అభినందించారు.

హైందవ శంఖారావం సభకు పటిష్ట భద్రత

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో ఆదివారం జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభ ప్రాంగణాన్ని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ బహిరంగ సభకు సుమారు మూడు లక్షల మంది జనం వస్తున్న నేపథ్యంలో భద్రత పరంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ సుమారు మూడు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కోనేరు హంపికి ఘన స్వాగతం

విజయవాడస్పోర్ట్స్: ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకుని స్వస్థలానికి చేరుకున్న కోనేరు హంపికి గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆమెకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) స్పోర్ట్స్ ఆఫీసర్లు కోటేశ్వరరావు, మహేష్, కోచ్‌లు భాస్కర్, జగదీష్, సంతోష్, ముంతాజ్‌బేగం, ఇసాక్, స్వామి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. విజయవాడ నగరానికి చెందిన పలువురు చెస్ క్రీడాకారులు, చెస్ క్రీడాభిమానులు ప్లకార్డులతో ఆమెకు ఆత్మీయ స్వాగతం చెప్పారు.

విజయవాడకు చెందిన హంపి రెండో సారి ప్రపంచ చాంపియన్ టైటిల్ సొంతం చేసుకుని నగర ఖ్యాతిని ప్రపంచానికి చాటింది. రెండు సార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ గెలుచుకున్న మొదటి భారతీయ మహిళగా ఆమె కీర్తికెక్కింది. చదరంగం క్రీడా చరిత్రలో ఆమె అత్యున్నత స్థాయికి చేరడంపై నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ టైటిల్‌ను సొంతం చేసుకున్న హంపికి శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ పి.ఎస్.గిరిషా శనివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.



కోనేరు హంపికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న శాప్ అధికారులు, కోచ్‌లు

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి రవీంద్ర జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలసి స్థానిక లేడీయాంప్థిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ పథకాన్ని ప్రారంభించారు. కళాశాలలోని విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నేటి నుంచి 475 జూనియర్ కళాశాలల్లో 1.48 లక్షల మంది విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల విద్యార్థులకు నోట్, పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. యూనిఫామ్ కూడా ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ జీవితంలో కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని కష్టపడితే సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు. 'హ్యారీ పోట్టర్' రచయిత్రి జేకే రోలింగ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సుందరలక్ష్మి 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు బండి రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, గోపు సత్యనారాయణ, డీఈవో పీవీజే రామారావు, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి పీబీ సాల్మన్‌రాజు, ఎంఈఓ దుర్గాప్రసాద్, హైస్కూల్ హెచ్‌ఎం మెటిల్డారాణి పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

నాణ్యత 'రోడ్డు'పాలు

- జిల్లాలో 39 రోడ్ల పనులు ఆరంభం.. 19 మాత్రమే పూర్తి
- రహదారి పనుల టెండర్లు దక్కించుకున్న కూటమి నేతలు
- సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని తూతూమంత్రంగా...
- జంగిల్ క్లియరెన్స్ పేరుతో నేతల జేబుల్లోకి ప్రజాధనం

సాక్షి, మచిలీపట్నం: జిల్లాలోని వివిధ రోడ్లలో గుంతలు పూడ్చేందుకు, మరమ్మతుల కోసం రెండు నెలల క్రితం ప్రభుత్వం చర్యలు చేపట్టి, సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం విధించింది. అయితే కొందరు నేతలు మంచి రోడ్లను మంజూరు చేయించుకుని, పై పూతలా పనులు చేసి, బిల్లులు చేయించుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొన్ని చోట్ల జంగిల్ క్లియరెన్స్ పేరుతో పనులు మంజూరు చేయించుకొని వాటాలు పంచుకుంటున్నట్లు సమాచారం. కమీషన్లు ఇవ్వని కొన్ని చోట్ల బిల్లులకు బ్రేక్ వేయడంతో పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది.

మంజూరైన పనులు

- గన్నవరం పరిధిలోని మూడు పనులకు ఒక ప్యాకేజీలో ప్యాచ్ వర్క్ పేరుతో 17.40 కి.మీ.కు రూ.24లక్షలు మంజూరు చేశారు.
- మచిలీపట్నం డివిజన్‌లోని ఏడు పనులకు 85.78 కి.మీ. మేరకు రోడ్లలో జంగిల్ క్లియరెన్స్ కోసం రూ.11.45 లక్షలు మంజూరు చేశారు.
- పెనమలూరులోని తొమ్మిది బీటీ రోడ్లలో గుంతలు పూడ్చేందుకు, గన్నవరంలో మూడు పనులు కలిపి 47.53 కి.మీ.కు రూ.2.62 కోట్లు మంజూరు చేశారు.
- మచిలీపట్నం డివిజన్ పరిధిలోని మరో 294.90 కి.మీ. మేర తొమ్మిది బీటీ రోడ్ల ప్యాచ్ వర్క్ పనులకు రూ.38.50 లక్షలు మంజూరు చేశారు. వీటిలో జిల్లా ప్రధాన రహదారులు ఉన్నాయి.
- మరో 149 రోడ్లలోని గుంతలు పూడ్చేందుకు, జంగిల్ క్లియరెన్స్ పనులకు రూ.54.27 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించారు. 569 కిలోమీటర్ల మేర ఈ పనులకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలుస్తోంది.



కంకిపాడు–రొయ్యూరు రోడ్డుకు రూ.3.75 కోట్లు మంజూరు కాగా మధ్యలో ఆగిపోయిన పనులు

సంక్రాంతికి పూర్తవడం కల్ల...

జిల్లాలో మంజూరైన పనుల్లో ఇప్పటికి 39 రోడ్ల పనులు ప్రారంభం కాగా కేవలం 19 మాత్రమే పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల పనులు ఆగిపోయాయి. దీంతో ఇవి పూర్తి కావడం అనుమానంగానే ఉంది.

రోడ్ల మరమ్మతుల తీరిది...

- గన్నవరం మండలం కేసరపల్లి రోడ్డుపై రూ.లక్షలతో పూడ్చిన గుంతలు మూడు నెలలకే యథాస్థితికి చేరుకున్నాయి. కేసరపల్లి నుంచి ఏలూరు కాలువ వరకు రూ.7.50 లక్షలు, కేసరపల్లి–సవారిగూడెం రోడ్డుకు రూ.4.50 లక్షలు కేటాయించారు. మూడు నెలల క్రితం కేసరపల్లిలో కలెక్టర్ బాలాజీ పనులు ప్రారంభించారు. పూడ్చిన గుంతలు అప్పుడే దెబ్బతిన్నాయి. ఏలూరు కాలువ వంతెనకు సమీపంలో దెబ్బతిన్న రోడ్డును తవ్విన కాంట్రాక్టర్ మూడు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు. సవారిగూడెం రోడ్డు మరమ్మతుల పనులు ఇంకా ప్రారంభించలేదు.
- కంకిపాడు–రొయ్యూరు రోడ్డుకు రూ.3.75 కోట్లు కేటాయించారు. ఐదు కిలోమీటర్ల మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టగా, ప్రస్తుతం రెండు కిలోమీటర్ల మేర తారు రోడ్డు పూర్తయింది. మిగిలిన మరో కిలో మీటరు కంకర మిక్స్ పోసి ఉంచారు. ప్రస్తుతం పని ఆగిపోయి ఉంది.
- అవనిగడ్డలో ఏడు రోడ్ల మరమ్మతులకు రూ.1.80 కోట్లు మంజూరు చేశారు. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఎక్కడా పనులు జరగలేదు.
- పెడన మండలం నడుపూరు నుంచి ముదినేపల్లి మండలం వాడవల్లి వరకు ఆర్అండ్‌బీ రోడ్డు ఏడు మీటర్లు వెడల్పు నిర్మాణం చేపట్టాలి. ప్రస్తుతం నేలకొండపల్లి నుంచి వాడవల్లి వరకు రోడ్డును గత 20 రోజులు కిందట తవ్వి వదిలేశారు. మళ్లీ ఎప్పుడు మొదలు పెడతారనే విషయంలో స్పష్టత లేదు. రూ.50 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.
- కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం నుంచి ఒర్లగొంది తిప్ప, వీఎస్ రోడ్డు నుంచి నరసప్పచెరువు, మల్లెల చెరువు నుంచి మట్టగుంట, బీఎస్‌రోడ్డు నుంచి కొమాళ్లపూడి, పోడు నుంచి చినగొల్లపాలెం రోడ్ల పనులు ప్రారంభించాల్సి ఉంది.
- బందరు మండలంలోని మూడు గ్రామాల్లో రోడ్ల మరమ్మతులకు రూ.1.20 కోట్లు మంజూరు చేశారు. ఉల్లిపాలెం బీసీ హాస్టల్ వరకు 50 అడుగుల మేర రోడ్డు పూర్తి చేయగా, పొట్లపాలెం వరకు గుంతల్లో తారు పోసి మమ అనిపించారు.
- గుడ్లవల్లేరు–రుద్రపాక సెక్షన్‌లో ఎస్‌హెచ్ రోడ్డు పరిధిలో రెండు రోడ్లు, ఎండీఆర్ఎస్ గుడివాడ నార్త్–పామర్రు సెక్షన్ పరిధిలో 13 రోడ్లు ఉండగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. అయితే ఇవి నత్తనడకన సాగుతున్నాయి.



మూడు నెలల క్రితం కేసరపల్లి రోడ్డుపై పూడ్చిన గుంతలు మళ్లీ మామూలే...

నాణ్యతతో పూర్తికి చర్యలు



జిల్లాలో మంజూరు అయిన రోడ్లను నాణ్యతతో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. ముఖ్యంగా రోడ్లపై గుంతలు పూడ్చడంతో పాటు ఇబ్బంది కరంగా ఉన్న వాటికి నిధులు మంజూరు అయ్యాయి. వాటిని సంక్రాంతిలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా చేపడుతున్నాం.

– లోకేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఈఈ, కృష్ణాజిల్లా

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు యువత దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఆసక్తి కలిగిన రంగంలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎస్‌కే ఫర్జానాబేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్, పార్శీ వర్గాలకు చెందిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు నెలల పాటు జరిగే శిక్షణ కాలంలో వసతి, భోజనం, యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణ పూర్తయిన తరువాత ఉపాధి అవకాశం కల్పిస్తామని చెప్పారు. అర్హులైన యువత బయోడేటా, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్, అర్హత కలిగిన సర్టిఫికెట్లతో విజయవాడ పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. 80088 79191, 0866- 2571125 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

7న గుడివాడలో జాబ్ మేళా

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనాశాఖ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన గుడివాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి పి.నగేష్‌కుమార్ శనివారం తెలిపారు. గుడివాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. జాబ్‌మేళాలో మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్, టాటా క్యాపిటల్ ఇండియా లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటాయని చెప్పారు. 7 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 31 సంవత్సరాల్లోపు వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాకు బయోడేటాతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 98488 19682, 99888 53335 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పసుపు రైతుల్లో గుబులు

- వ్యాపిస్తున్న దుంప కుళ్లు తెగులు
- దిగుబడులపై ప్రభావం చూపుతోందని అన్నదాతల ఆందోళన
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న శాస్త్రవేత్తలు



ప్రొద్దుటూరులో దుంప కుళ్లు తెగులు ఆశించిన పసుపు తోట

కంకిపాడు: పసుపు రైతుల్లో దుంప కుళ్లు తెగులు గుబులు రేపుతోంది. పసుపు దుంప ఊరే సమయంలో ఈ తెగులు వ్యాప్తి చెందుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తెగులు ప్రభావం దిగుబడులపై అధికంగా ఉండనుండటంతో దిగాలు పడుతున్నారు. ప్రధాన వాణిజ్య పంటల్లో పసుపు పంట ముఖ్యమైంది. పచ్చ బంగారంగా పిలిచే పసుపు సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 1406.102 హెక్టార్లలో పసుపు పంట సాగు జరిగింది. కడప, మైదుకూరు, ప్రగతి, శీలం ఇతర స్థానిక రకాలను ఎంపిక చేసుకుని రైతులు సాగు చేసుకున్నారు.

వెంటాడుతున్న కష్టాలు..

ఈ ఏడాది పసుపు రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. మార్చి, ఏప్రిల్‌లో పంట చేతికి అందిన తరుణంలో క్వింటా పసుపు కొమ్ములు ధర రూ.15 వేల వరకూ పలికింది. మార్కెట్‌లో ధరను చూసి సంతోషించే లోపు క్రమంగా ధర తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం క్వింటా ధర రూ.11,400 వరకు ఉంది. అయితే జూన్‌లో తొలకరి వర్షాలతో పసుపు సాగు చేపట్టారు. ఎకరాకు ఆరు పుట్లు(పుట్టు అంటే 225 కిలోలు) చొప్పున విత్తనం నాటారు. విత్తనానికి గతంలో ఎన్నడూ లేని విధంగా పుట్టుకు రూ.10 వేలు వెచ్చించి పెట్టుబడులు పెట్టారు. సాగు ఆరంభంలోనే పెట్టుబడులు అధికమై సాగు వ్యయం కూడా భారమైంది. పంట ఆశాజనకంగా ఎదుగుతున్న తరుణంలో సెప్టెంబరులో భారీ వర్షాలు, కృష్ణానదికి సంభవించిన వరద కారణంగా పసుపు పంటకు అపార నష్టం వాటిల్లింది. పంట దెబ్బతినగా ప్రస్తుతం 1,406 హెక్టార్లలో వివిధ ప్రాంతాల్లో పంట సాగు జరుగుతుంది.

దుంప కుళ్లతో దిగులు..

వాతావరణ పరిస్థితులు, దుంప ఊరే సమయంలో వ్యాప్తించే దుంప కుళ్లు తెగులు ప్రస్తుతం పసుపు తోటల్లో కనిపిస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. పర్యటనలో భాగంగా పసుపు తోటల్లో దుంప కుళ్లు/వేరుకుళ్లు తెగులు ఉన్నట్లు నిర్ధారించారు. పసుపు దుంప ఊరే సమయంలో తెగులు వ్యాప్తి చెందటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పంట చేతికి అందే సమయంలో దిగుబడులపై ప్రభావం ఉంటుందని దిగులు చెందుతున్నారు. ఎకరాకు ఐదు నుంచి పది పుట్లు వరకూ దిగుబడుల్లో వ్యత్యాసం ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు.

తెగులు లక్షణాలు..

- మొక్కల చుట్టూ నీరు నిలబడి ఉండటం.
- మురుగు పోయే మార్గం లేక పొలంలో రోజులు తరబడి నీరు నిల్వ ఉండటం.
- పొటాష్, వేపపిండి ఎరువులను సక్రమంగా వాడకపోవటం వల్ల తెగులు వ్యాప్తి చెందుతుంది.
- తెగులు వ్యాప్తి చెందిన పొలంలో ముదురు ఆకులు వాడిపోయి గోధుమ రంగుకు మారి చివరికి వాడిపోతాయి.
- తెగులు వ్యాప్తిని ప్రాథమిక దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ఉత్తమం.

సస్యరక్షణ చర్యలు మేలు

పసుపు పొలాల్లో దుంప కుళ్లు తెగులు ఉండటాన్ని గుర్తించాం. తెగులు నివారణకు లీటరు నీటికి మూడు గ్రాములు మెటలాక్సిల్ లేదా బ్లైటాక్స్ కలిపి మొక్కల మొదళ్లలో పోసుకోవాలి. దీని వల్ల తెగులు వ్యాప్తి అరికట్టవచ్చు. ఒక కిలో ట్రైకోడెర్మా 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండిలో కలిపి వారం రోజుల పాటు పైరు ఎదుగుదలకు అనుకూల పరిస్థితుల్లో నీటి తడి ఇచ్చి వెంటనే చల్లుకోవాలి.

– డాక్టర్ వి.మంజువాణి, శాస్త్రవేత్త, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం

సుబ్రహ్మణ్యుని సన్నిధిలో న్యాయమూర్తి రామకృష్ణయ్య



మోపిదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జడ్జి రామకృష్ణయ్య దంపతులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని డీఎల్ఎస్ఏ జడ్జి కేవీ రామకృష్ణయ్య దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మణిదీప్‌శర్మ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

7న ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ క్రికెట్ పురుషుల జట్టును ఈ నెల 7వ తేదీన ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కాలేజీ మైదానంలో ఎంపిక చేస్తున్నట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. వర్సిటీ పరిధిలోని మెడికల్, డెంటల్, ఆయుర్వేద, హోమియోపతి, యునాని, బీఎస్‌వైస్, ఫిజియోథెరపీ, బీఎస్సీ(నర్సింగ్), బీఎస్సీ(ఎంఎల్‌టీ) కాలేజీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 7వ తేదీ ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రాంగణంలో నిమ్రా కాలేజీ ఫిజికల్ డైరెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. వర్సిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక..

దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ మహిళల పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ జట్టును వర్సిటీ స్పోర్ట్స్‌బోర్డ్ సెక్రటరీ డాక్టర్ త్రిమూర్తి శనివారం ప్రకటించారు. అనిత, అనిల, లక్ష్మి, సాయిసంపద, శ్రీసాయిజ్యోతిర్మయి, సంజన, గౌరీఅన్నపూర్ణాదేవి, అభినయ, సృజన, సురేఖ, నాగమల్లేశ్వరి, అఫ్రీన్, సిరి, భార్గవి జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. జట్టుకు మేనేజర్‌గా డీవీవీఎస్ శ్రీనివాసరావు, కోచ్‌గా జీబీఎస్ కుమారరాజు వ్యవహరిస్తారన్నారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు చెన్నైలోని జెప్పియార్ వర్సిటీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని చెప్పారు.

19న విజయవాడలో గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యాశంకర్ నాయక్, మల్లికార్జున నాయక్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈనెల 19వ తేదీన గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ చేతుల మీదుగా సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సభకు ముఖ్య అతిథిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, కేరళ ఐజీ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ హాజరవుతున్నారన్నారు. సభకు వేలాదిగా గిరిజన ఆదివాసీలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైదా నాయక్, నేతలు రవీంద్ర నాయక్, శివ నాయక్, హనుమంతు నాయక్, రంగారావు, ఇస్లావత్ హనుమంతు నాయక్, భాస్కర్ నాయక్, వివిధ జిల్లాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ మిషన్ బ్లైండ్ కార్యాలయం ప్రారంభం



కేతనకొండలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎలీషా, రాజు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా మండలంలోని కేతనకొండ గ్రామంలో ఏర్పాటు చేసిన ఏపీ మిషన్ బ్లైండ్ కార్యాలయాన్ని గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా శనివారం ప్రారంభించారు. ఎలీషా మాట్లాడుతూ.. ప్రత్యేక లిపి రూపొందించిన బ్రెయిలీ చిరస్మరణీయులన్నారు. ఏపీ మిషన్ బ్లైండ్ కార్యాలయం నుంచి అంధులకు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ మిషన్ బ్లైండ్ డైరెక్టర్ రాజు, ప్రేమ్ కుమార్, రాజేంద్రప్రసాద్, అబ్రహాం, అనూష, నజ్మా తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

పెనమలూరు: బాలికపై యువకుడు లైంగిక దాడి చేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు శుక్రవారం రాత్రి నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే కానూరు సనత్‌నగర్ రాయాలయం వద్ద బాలిక(16) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటోంది. ఆమె స్థానికంగా ఉన్న వాటర్ ప్లాంట్‌లో పని చేస్తోంది. ఈ క్రమంలో కంకిపాడుకు చెందిన విజయబాబు అనే వ్యక్తి బాలికతో ఫోన్‌లో చాటింగ్ చేసి పరిచయం పెంచుకున్నాడు. ఈ నెల 2న వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్న బాలికకు విజయ్‌బాబు ఫోన్ చేసి తాను ఆటోనగర్ టెర్మినల్ వద్ద ఉన్నాను రమ్మని చెప్పాడు. బాలిక పని ముగించుకుని అక్కడకు వెళ్లగా విజయ్‌బాబు బైక్‌తో అక్కడ ఉన్నాడు. బైక్‌పై సరదాగా విజయవాడలో తిరిగి వద్దామని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన బాలికను కంకిపాడు తీసుకువెళ్లాడు. రూమ్‌లో బాలికను బంధించి, లైంగిక దాడి చేశాడు. బాలికను 3వ తేదీన కంకిపాడులో బస్సు ఎక్కించి పంపాడు. బాలిక ఇంటికి వచ్చి జరిగిన ఘటనను తల్లిదండ్రులకు చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విజయబాబుపై అత్యాచారం కేసు నమోదు చేశారు. ఈ ఘటనను పోలీసులు మీడియాకు తెలియకుండా గోప్యంగా ఉంచారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. బాలిక ఆత్మహత్య

శనగపాడు(పెనుగంచిప్రోలు): ప్రేమ పేరుతో వేధింపుల కారణంగా బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శనగపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలిక(14) శనగపాడులోని తాత, నాయనమ్మ దగ్గర ఉంటూ నందిగామ దగ్గరలోని పల్లగిరి సమీపంలోని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమెను గత కొంతకాలంగా అనిగండ్లపాడు గ్రామానికి చెందిన ఈమన గోపి అనే యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు విషయం తెలిపి నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. మృతురాలికి తల్లిదండ్రులతో పాటు సోదరి ఉంది. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎంఎస్‌కే అర్జున్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గోపిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

వెనక్కి నడుస్తూ వలంటీర్ల నిరసన



బీఆర్టీఎస్ రోడ్డులో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని, తమకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా యూటర్న్ తీసుకోవడాన్ని నిరసిస్తూ బీఆర్టీఎస్ రోడ్డులో శనివారం వలంటీర్లు వెనక్కి నడుస్తూ వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర బాబు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఉగాది రోజున తీపి కబురంటూ వలంటీర్లను రూ.10 వేల గౌరవ వేతనంతో కొనసాగిస్తామని మాట ఇచ్చారన్నారు. నేడు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఒక్క క్యాబినెట్ సమావేశంలో కూడా వలంటీర్ల గురించి మాట్లాడలేదని విచారం వ్యక్తం చేశారు. బుడమేరు వరద సమయంలో వలంటీర్లతో సేవలు చేయించుకుని ఇప్పుడు పట్టించుకోవటం లేదని వాపోయారు. 8 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఉద్యోగం ఉందో లేదో తెలియనటువంటి అయోమయ పరిస్థితిల్లోకి నెట్టేసి చోద్యం చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల ముందు నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వలంటీర్లు జి.మమత, ఎస్. తేజస్విని, డి.స్వప్న, యు.కళ్యాణ్, జి.శిరీష, సరోజినీ, భాను, దమ్ము రమేష్, సుప్రియ, కె.రాజ్యలక్ష్మి, కె.పూజిత, పి.నరేష్, వి.లావణ్య, కె. సుస్వన్న, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెనుగొండ సాహిత్య సేవలను ఆదర్శంగా తీసుకోవాలి



పెనుగొండ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: పెనుగొండ లక్ష్మీనారాయణ సాహిత్యసేవలను ఆదర్శంగా తీసుకోవాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అన్నారు. అభో.విభో, కందాళం, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బందరురోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలు సామాజిక అంశాలను చాటుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో కథానాటిక ప్రదర్శనలు, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెనుగొండ ఆధ్వర్యంలో అభ్యుదయ రచయితల సంఘం ఉత్సాహంతో పరుగులు పెడుతోందన్నారు. అభో విభో వ్యవస్థాపకుడు సత్యనారాయణ మాట్లాడుతూ 1974 లో ప్రారంభమైన ఆయన సాహిత్య ప్రస్థానం కేంద్ర సాహిత్య పురస్కారం అందుకోలేనంత వరకు సాగిందన్నారు. విద్యావేత్త రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, వికాస విద్యావనం చైర్మన్ ఎస్ఆర్ పరిమి, జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు ఏ.సుశీల్‌కుమార్ పాల్గొన్నారు. నిర్వాహకులు పెనుగొండకు విశిష్ట సాహితీమూర్తి విశిష్ట సేవా పురస్కారంతో పాటు రూ.50 వేల నగదు పురస్కారం ప్రధానం చేశారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

విడాకులు కావాలి, దేవ రాగం నాటికలు ప్రదర్శించారు. విడాకులు కావాలి నాటికకు మూల కథ పొత్తూరి విజయలక్ష్మి, నాటకీరణ, వల్లూరి శివప్రసాద్, దర్శకత్వం గంగోత్రి సాయి, దేవ రాగం నాటికకు మూలకథ సలీమ్, నాటకీరణ, దర్శకత్వం కేకేఎల్ స్వామి వహించారు.

వ్యసనాలకు బానిసై.. ఉరి వేసుకొని

పెనమలూరు: యనమలకుదురులో వ్యసనాలకు బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాసానగర్ కాలువ కట్టపై గోగులమూడి బుజ్జమ్మ నివసిస్తోంది. ఆమె భర్త గతంలో చనిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు గోగులమూడి జోజిబాబు(25)ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది. జోజిబాబు వడ్రంగి పని చేస్తాడు. అతడు వ్యసనాలకు బానిసై యనమలకుదురు పరిధి ఇందిరానగర్ - 1 ప్రాంతంలో కట్టపై ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. అతని ఇంటి సమీపంలో ఉండే ఇంతియాజ్ బుజ్జమ్మకు ఫోన్ చేసి ఇంట్లో దుర్వాసన వస్తోందని తెలిపాడు. ఆమె వచ్చి చూడగా జోజిబాబు ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

విస్సన్నపేట: ఆటో టైరు పేలి విస్సన్నపేట సమీపంలోని శ్రీరాంపురం స్టేజీ వద్ద శనివారం రాత్రి ఓ మహిళ మృతి చెందగా 10 మందికిపైగా కూలీలు గాయపడ్డారు. ఏ.కొండూరు మండలంలో మిర్చి కోతలకు వెళ్లి తిరిగి వస్తున్న కొండపర్వ గ్రామానికి చెందిన మహిళా కూలీలు ప్రయాణిస్తున్న ఆటో టైరు పేలి అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కొండపర్వకు చెందిన దోనెల్లి మునిమ్మ(35) తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మృతి చెందింది.